నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | ఆగస్టు 27, 2024 | www.navatelangana.com

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సోమవారం ఎస్పీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లో సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కేసులను త్వరిగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించి, సమస్య పరిష్కారమయ్యే వరకు జవాబుదారీతనంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.



మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రానికి చెందిన జయహో టీం సభ్యులతో కలిసి ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం పోస్టర్లు ఆవిష్కరించారు. వచ్చే నెల 3,4 తేదీల్లో కరీంనగర్ పట్టణంలో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువతకు సరైన సలహాలు, సూచనలు అందడం లేదని తెలిపారు. ఫలితంగా యువత భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేసుకోలేకపోతున్నారని అన్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నందున మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాం ద్వారా ఉపయోగకరమైన సూచనలు అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రసిద్ధి చెందిన వక్తలు తెలుగులో యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. జీవితంలో ఏదో సాధించాలనే తపన ఉన్న వారికి ఇంపాక్ట్ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవకాశాన్ని మండల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీఐ జయహో అధ్యక్షులు గూడ జనార్ధన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, దుస్స భాస్కర్, ఈగ సురేందర్, నాగిరెడ్డి, రాజిరెడ్డి, హన్మంతు, వివేక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్పంచ్ గిరిపై..యువత గురి..!

- ఎన్నికల్లో పోటీకి ఆసక్తి కనబరుస్తున్న నవతరం
- ఊరోళ్ల మద్దతు సాధించేందుకు తాపత్రయం
- గ్రామాల్లో అప్పడే మొదలైన సందడి వాతావరణం
- ఓటరు ముసాయిదా సిద్ధం చేస్తున్న యంత్రాంగం

సర్పంచ్ అంటే..గ్రామ ప్రథమ పౌరుడు. ఏదైనా పల్లెకు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి వారు వచ్చినా ఆ సభలకు అధ్యక్షత వహించేది స్థానిక సర్పంచే. ఇది ఈ పదవికి ఉన్న ప్రాధాన్యత. మరోపక్క సర్పంచ్ అంటే సమాజంలో గౌరవం కూడా లభిస్తుంది. దీంతో ఈ పదవిపై తాజాగా యువత కూడా ఆసక్తి కనబర్చుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ముగిసిపోవడంతో ఇప్పుడంతా స్థానిక సంస్థల ఎన్నికలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. ముఖ్యంగా పల్లె పోరులో ఆసక్తిగా అనిపించే సర్పంచ్ ఎన్నికల అనగానే అందరిలోనూ ఉత్సాహం వస్తుంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రస్తుతం యువత ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో మద్య వయస్కులు, పెద్ద వయసు కలిగిన వారే ఎక్కువగా ఆసక్తి చూపించగా.. ఇప్పుడు పూర్తిగా ట్రెండ్ మారిపోయింది. ఈ పదవిని అలంకరించేందుకు ఎక్కువగా యువత సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఇప్పుడంతా స్థానిక సంస్థల ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఎన్నికల సంఘం కూడా ఓటరు జాబితా తయారీకి ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తిచేయగా.. గ్రామాల్లో బీఎల్ఓలు ఓటరు జాబితాపై కసరత్తు ప్రారంభించారు. దీంతో అందరి దృష్టి తొలుత సర్పంచ్ ఎన్నికలపైనే ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిపోవడంతో మరుసటి రోజు నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో పాలకవర్గాలు లేక గ్రామాల్లోనూ



పాల్గొన్న ఉద్యోగులు

సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ తరుణంలో తొలుత సర్పంచ్ ఎన్నికలు, అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. మూడు నెలల క్రితమే ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగినా వివిధ కారణాలతో జాప్యం జరిగింది. తాజాగా ఓటరు జాబితా ముసాయిదా తయారుచేయాలని ఆదేశాలు జారీ కావడంతో ఈ ప్రక్రియ పూర్తికాగానే ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని సర్వత్రా చర్చకు దారితీస్తోంది. మరోపక్క రిజర్వేషన్లపై మాత్రం ఇంకా సందిగ్ధం వీడటం లేదు. బీసీ గణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వినిపిస్తుండటంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత నిర్వహిస్తే మాత్రం కొంత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది.

పదవిపై యువత ఆసక్తి..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1508 గ్రామ పంచాయతీలు ఉండగా 12,780 వార్డులున్నాయి. 567ఎంపీటీసీ స్థానాలు, 66జడ్పీటీసీలు స్థానాలు ఉండగా సుమారు 3వేల వరకు పోలింగ్ కేంద్రాలున్నాయి. తొలుత సర్పంచ్ ఎన్నికలు ఉండటంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత ఆసక్తి చూపిస్తున్నారు. 25 నుంచి 40ఏండ్ల మద్య వయస్సు కలిగిన వారు పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సొంతంగా ఎవరికి వారు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి ప్రచారాలు ప్రారంభించారు. వారికి అనుకూలమైన వారిని కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామస్తులందరితో కలివిడిగా ఉంటూ సత్సంబంధాలు ఏర్పాటుచేసుకుంటూ వారి మద్ధతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా అందరిలోనూ రిజర్వేషన్లపైనే దృష్టి కేంద్రీకృతమవుతోంది. పాతవి ఉంటే ఎవరు పోటీ చేయాలి..కొత్తగా మారితే ఎవరిని పోటీ చేయించాలో కూడా ఇప్పటికే సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా కొందరు ఇప్పటికే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గ్రామస్తులకు ఏదైనా సమస్య ఎదురైతే వాటి పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి కలవడం వంటి పనులు చేస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. మరోపక్క ఆయా రాజకీయ పార్టీలు సైతం పంచాయతీల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తి రేపుతోంది. మరో ఒకటి, రెండు నెలల్లో పల్లె పోరుతో గ్రామాల్లో సందడి వాతావరణం కనిపించనుంది.

రైతుల పొట్ట కొట్టొద్దు



నవతెలంగాణ-మంచిర్యాల

హైవే పేరుతో రైతుల పొట్ట కొట్టొద్దని, రహదారి అలైన్మెంట్ మార్చిన మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్‌పై ఫిర్యాదు చేశారు నేషనల్ హైవే 63 కింద భూములు కోల్పోతున్న రైతులు. సోమవారం ఆదిలాబాద్ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంచిర్యాలకు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యేను కలిసిన రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 500 మంది రైతులు తమ భూములు కోల్పోతున్నారని, 2023లో ఇచ్చిన బ్రౌన్ ఫీల్డ్ హైవే ప్రకారం రోడ్డు నిర్మాణం చేయాలని తెలిపారు. మైనారిటీ కళాశాల నిర్మాణం కోసం బ్రౌన్ ఫీల్డ్ హైవేను గ్రీన్ ఫీల్డ్‌హైవేగా మార్చారని, గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకే ఇప్పటికీ న్యాయం జరగలేదని తెలిపారు. మళ్లీ ఇప్పుడు రైతుల పొట్ట కొట్టాలని చూస్తున్నారని, దీంతో రైతుల జీవనోపాధిపై దెబ్బ పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రఘునాథ్ మార్చిన రోడ్ అలైన్మెంట్లతో రైతాంగంపై పెద్ద దెబ్బ పడుతుందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి పాత అలైన్మెంట్ విధానంలో ఎన్‌హెచ్ 63 నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు.

అనాథ చిన్నారులకు నిత్యావసరాలు పంపిణీ



నవతెలంగాణ-లోకేశ్వరం

రోజుల క్రితం పాముకాటుతో మృతి చెందిన దుర్గానగర్ తండాకు చెందిన లక్ష్మి పిల్లలకు మా అమ్మా నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఎం.ఆంజనేయులు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, బట్టలు అందజేశారు. కూలి పనులు చేసుకుని పిల్లలను పోషించి తల్లి చనిపోవడంతో పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకొని దాతలు సాయం చేస్తున్నారు. సోషల్ మీడియా తెలుసుకున్న డాక్టర్ దేవేందర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా ఎం.ఎ.కలీం రూ.3వేల బట్టలు పంపించారు. లోకేశ్వరానికి చెందిన పులి సవిత రమేష్, చిన్నయ్య రూ.వేయి చొప్పున సాయం చేశారు. యోగేష్ స్వామి, నిజామాబాద్‌కు చెందిన గంగాధర్, ఆదిలాబాద్ నుండి ఉల్లాస్ రూ.500 చొప్పున అందించారు.

చెట్ల నరికివేతపై విచారణ

నవతెలంగాణ-ముథోల్

నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ జరిపారు. ఆదివారం ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్లను నరికేసిన విషయం పత్రికల్లో ప్రచురితమైంది. దీంతో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ గుగ్లవత్ నంద్యానాయక్, బీట్ ఆఫీసర్ కృష్ణ సోమవారం విచారణ జరిపారు. నరికి వేసిన చెట్లను పరిశీలించి కొలతలు సేకరించారు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు ఆసుపత్రి బాధ్యులకు నోటీసు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేతో పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నేతకాని మహర్ కులస్తుల సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన నేతకాని పొలాల పండగ వాల్ పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి గంగేష్, రాష్ట్ర నాయకులు బోర్లకుంట దుర్గయ్య, జిల్లా అధ్యక్షులు జాడి కేశవ్‌రావు పాల్గొన్నారు.

వేలాల మల్లన్నను దర్శించుకున్న డీసీపీ

నవతెలంగాణ-జైపూర్

వేలాల గ్రామంలో లింగాకారుడై వెలిసిన మల్లిఖార్జున స్వామిని మంచిర్యాల డీసీపీ భాస్కర్ దర్శించుకున్నారు. శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి వేలాల గ్రామంలో గల మల్లిఖార్జున స్వామితో పాటు గుట్టపై వెలిసిన గట్టు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాన్ని సందర్శించిన డీసీపీ భాస్కర్‌తో పాటు పోలీస్ అధికారులను స్థానికులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై శ్రీధర్, నాయకులు లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ దేగ నగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌన్సిలర్‌పై ఫిర్యాదు



నవతెలంగాణ-నస్పూర్

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీపీ, 21వ వార్డు కౌన్సిలర్ బేర సత్యనారాయణపై మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు ఆధ్వర్యంలో సోమవారం సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేపై ఎవరైన తప్పుడు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ పూదరి కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీపతి మల్లేష్, బొద్దున రామ్మూర్తి, గెల్లు మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకూ రుణమాఫీ వర్తింపజేయాలి

- సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షునిగా ఇన్నారెడ్డి ఎన్నిక

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా అరకపట్టి పంటలు సాగుచేసే వారే కాబట్టి వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి డిమాండ్ చేశారు. సాగు చేసే ఉపాధ్యాయులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. సోమవారం పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో రఘోత్తమరెడ్డి మాట్లాడారు. దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు గల టీచర్స్ యూనియన్ పీఆర్టీయూ అన్నారు. తమ పోరాటాలతోనే విద్యారంగానికి మేలు జరుగుతుందన్నారు. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ రావడం పీఆర్టీయూ పోరాట ఫలితమే అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించడం ఫలితంగా 22 వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్, 39 వేల మందికి బదిలీలు జరిగాయని పేర్కొన్నారు. త్వరలో 5450 మంది ఎస్‌జీటీలకు హెడ్ మాస్టార్లుగా ప్రమోషన్ రానుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలను వ్యతిరేకించి పోరాటాలు చేయడం ఫలితంగా నేడు పాఠశాలల అభివృద్ధితో పాటు ఉచిత కరెంట్ లభిస్తుందన్నారు. గత బకాయిలు కూడా ఉపాధ్యాయులు చెల్లించవద్దని, అవి కూడా మాఫీ అయ్యే అవకాశం ఉందని సూచించారు. ఉపాధ్యాయుల ప్రమోషన్‌లకు టెట్ లింక్ అని ప్రభుత్వం చెప్పడంతో పెద్ద మొత్తంలో ఉద్యమం చేయడం ద్వారా ప్రభుత్వాల్లో కదలిక వచ్చి టెట్ నిబంధన తొలగించి ప్రమోషన్‌లు కల్పించారని గుర్తు చేశారు. ఫిట్మెంట్‌పై రేవంత్ సర్కార్ చర్చలకు పిలవగా గత ప్రభుత్వమైతే ప్రభుత్వం రెండు దఫాలుగా 30, 43శాతం ఫిట్‌మెంట్ ప్రకటించినా ఉపాధ్యాయులు కాంగ్రెస్‌కు ఓటు వేశారని, ఇప్పుడు అంతకన్నా ఎక్కువ ఇవ్వాలని సూచించామని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే ఏకైక యూనియన్ పీఆర్టీయూ అని పేర్కొన్నారు. ఏ పోరాటాలు చేయకుండా ప్రభుత్వాలు కల్పించిన వాటిని తమ పోరాటంగా కొన్ని సంఘాలు చెప్పుకుంటాయని విమర్శించారు. సీపీఎస్ రద్దుకు రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వెయ్యి మంది





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి(పైన) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన ఇన్నారెడ్డి, రాసపల్లి రవి



ఉపాధ్యాయులతో ధర్నా చేసిన ఏకైక యూనియన్ పీఆర్టీయూ అని తెలిపారు. 317 జీవోతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. త్వరలో ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలకు ప్రభుత్వం ఒప్పుకుందని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్ పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షునిగా మరోసారి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి కోసం ఓటింగ్ జరగగా మొత్తం 72ఓట్లు పోలయ్యాయి. గత ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్‌కు 13 ఓట్లు రాగా ప్రత్యర్థి రాసపల్లి రవికి 56 ఓట్లు పోలయ్యాయి. 59 ఓట్ల మెజారిటీతో రవి గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రవి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి

- సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ముందు ధర్నా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్



నవతెలంగాణ-మంచిర్యాల

నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 2న జరిగే ధర్నా కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ జిల్లాలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. రైతు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా చేయాలని 27న రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపడతామన్నారు. దీనికి సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 2న కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్లో వారికి నచ్చిన రాష్ట్రాలకే ఎక్కువ కేటాయించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. సమావేశంలో రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, జోగుల మల్లయ్య, ఖలీందర్ అలీఖాన్, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిర్యాల రాజేశ్వరరావు, చాడ మహేందర్‌రెడ్డి, దేవి పోచన్న, మొగిలి లక్ష్మణ్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రామంలో మాజీ సర్పంచ్ అన్నదానం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడి రవి కృష్ణాష్టమిని పురస్కరించుకుని అన్నదానం ఏర్పాటు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం ఎక్కామ (ప్రత్యేక పూజా) కార్యక్రమం ద్వారా ఆదివారం ఉదయం ప్రారంభించిన భజన కార్యక్రమం సోమవారం ఉదయం వరకు నిర్వహించారు. అనంతరం గోపాల కాలువల కార్యక్రమం ద్వారా మర్రి చెట్టు కొమ్మలతో కృష్ణాష్టమి వేడుకలు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో పాటు గ్రామస్తులకు అన్నదానం చేశామని మాజీ సర్పంచ్ రవి తెలిపారు.

మారథాన్ రన్‌లో పాల్గొనడం అభినందనీయం : ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం, కుందారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మారథాన్ రన్‌లో పాల్గొనడం అభినందనీయమని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం తన నివాసంలో కలిసిన నాయకులు అరికె సంతోష్ యాదవ్, రాపల్లి శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. ఎన్ఎండీసీ, హైదరాబాద్ రన్నర్స్ సంయుక్తంగా నిర్వహించిన మారథాన్ 10 కిలో మీటర్లలో అరికె సంతోస్ యాదవ్, 21 కే రన్‌లో రాపల్లి శ్రీనివాస్ పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. మారథాన్ రన్‌లో మండలం నుండి ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనగా వారిని అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం వ్యాయామం, వాకింగ్ చేయడం అవసరమని పేర్కొన్నారు.



వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు



ప్రజలను కోరారు. సోమవారం వైద్యసిబ్బందితో కొత్తపెల్లి(హెచ్) బొజ్జు గూడలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంటింటా ర్యాపిడ్ ఫైవర్ సర్వే చేసి జ్వరం, జలుబు, దగ్గు, ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది శ్యామక ఉన్నారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని కొత్తపెల్లి(జి)లో సోమవారం అన్నాభావు సాఠే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నాయకులు, గ్రామస్తులు అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ



సందర్భంగా దళిత జిల్లా నాయకులు మోటేరావ్ అనిల్, జె.బాలాజీ మాట్లాడుతూ నేటితరం యువత, మేధావి సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి.మారుతి, జి ఆనంద్, కే.భీంశంకర్, డి.అశోక్, బి.పండరి, బి.బలరాం, కే.విష్ణు, బి.పరశు రామ్, ఎం.కిషన్, బలరాం, ధనరాజ్ ఉన్నారు.

కొట్నాక్ భీంరావు వర్ధంతిని జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొట్నాక్ భీంరావు తొలి ఆదివాసుల ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నికై ఈ ప్రాంతానికి మంచి సేవలందించారని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి కొట్నాక్ భీంరావు వర్ధంతి పోస్టర్లను రాజ్ గోండు సేవా సమితి, వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 29న ఉట్నూర్ మండల కేంద్రంలో మాజీ మంత్రి కొట్నాక్ భీంరావు వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆదివాసులు, ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం రాజ్ గోండు సేవా సమితి సభ్యులు ఐటీడీఏ పీఓకు సివిల్ సూట్‌లను విచారించే అధికారం లేదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని మళ్లీ ఐటీడీఏ పీఓకు సివిల్ సూట్‌లను విచారణ చేసే విధంగా అధికారాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కొట్నాక్ భీంరావు వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు, రాజ్ గోండు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

తీజ్ పాట ఆడియో, వీడియో చిత్రీకరణ చేసిన వారికి గాయకుడు కవన కోకిల బంకటలాల్ జాదవ్ శాలువాలతో ఆత్మీయ సత్కారం చేశారు. సోమవారం పట్టణంలోని రాంనగర్‌లోని తన నివాసంలో బంజారా తీజ్ పండుగని పురస్కరించుకొని కళాకారులకు, నాకు సహాయ సహకారాలు అందించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బంకటలాల్ మాట్లాడుతూ బంజారా ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను మార్చి పోకుండా భావితరాలకు అందించాలనే ఉద్యేశంతో ఈ తీజ్‌కు వారి చొరిరో బంజారా పాటను తీయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయక్ ప్రేమ్ సింగ్, అనన్య యూట్యూబ్ ఛానల్ ప్రొడ్యూసర్ చవాన్ సేవదాస్, డైరెక్టర్ రాథోడ్ శివ రికార్డింగ్ జైశీలన్, డీఓపీ మారుతి, కొరియోగ్రఫీ సమంత, మ్యూజిక్ వెంకటేష్, ముఖ్యఅథితులు రాథోడ్ శ్రవణ్ నాయక్, డాక్టర్ ఇందల్ సింగ్ బంజారా, చవాన్ పరమేశ్వర్, వినోద్, మురళి, వసంతరావు, మహేందర్, వంశి, కరణ్, పరశు రామ్, హరి, సంజీవ్, శ్రీరామ్, కైలాష్, మోహన్, ఆడపిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

ఇథనాల్ బాధిత రైతుల గోడును పట్టించుకోరా..?

- తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కన్నెగంటి రవి



నవతెలంగాణ-నిర్మల్

దిలావర్‌పూర్ మండలం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల పంట పొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఫ్యాక్టరీని రద్దు చేయాలని, గత 35 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతులకు సోమవారం తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కన్నెగంటి రవి, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కొండల్‌రెడ్డి, చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బండారి లక్ష్మయ్య, టిజాక్ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త రాజగోపాల్ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నెగంటి రవి మాట్లాడారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టకుండా ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని, బాధిత గ్రామాల రైతుల ప్రజల గోడును పట్టించుకోరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇథనాల్ కంపెనీల వల్ల గాలి, నీరు, భూమి కాలుష్యం ఏర్పడుతుందని, వ్యవసాయ భూములు దెబ్బతింటాయన్నారు. బియ్యం, మొక్కజొన్నతో ఇథనాల్ ఉత్పత్తి చేయడం వల్ల భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల పర్యావరణం నాశనమవుతుందని, ప్రజల జీవితాలను ధ్వంసం చేస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని పేర్కొన్నారు. ఇథనాల్ కంపెనీ రద్దయ్యేవరకు ఈ పోరాటాన్ని విరమించరాదని బాధిత గ్రామాల ప్రజలకు సూచించారు. టీజాక్ పోరాడే ప్రజల వైపే నిలబడుతుందని తెలియజేశారు. అనంతరం బండారి లక్ష్మయ్య మాట్లాడారు. చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని జరిగిన పోరాటం నుంచి మనం అనేక గుణపాఠాలను తెలుసుకుని, దీర్ఘకాల ప్రజాస్వామ్య శాంతియుత పోరాటం నడుపాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని, చిత్తూరు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బండారి లక్ష్మయ్య అన్నారు. బీజేపీ తీసుకు వచ్చిన ఇథనాల్ పాలసీని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకించకుండా అమలు చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇథనాల్ పాలసీని రద్దు చేయాలని కోరారు. శాంతియుతంగా పోరాడుతున్న దిలావర్‌పూర్ ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని అన్నారు. అనంతరం కొండల్ రెడ్డి మాట్లాడారు. నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలువడానికి వెళ్లిన బాధిత ప్రజలను తరలించిన ఆటోలను సీజ్ చేయడమే కాకుండా, అక్రమ కేసులు బనాయించారని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కొండల్‌రెడ్డి అన్నారు. ఆ కేసులను వెంటనే ఎత్తివేసి ఆటోలను విడుదల చేయాలని కోరారు.



ఐక్యమత్యంతో హక్కులు కాపాడుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన లంబాడా, ఆదివాసీ మిత్రులు ఐక్యమత్యంతో ఉండి మన హక్కులను కాపాడుకోవాలని లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ అన్నారు. సోమవారం మండలంలోని లింగోజితండ గ్రామపంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్ తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న ఏజెన్సీ బంద్ సందర్భంగా 33 తెగలకు సంబంధించిన గిరిజనుల సమస్యలు కూడా అందులో ఇమిడి ఉన్నాయని, జీఓ నెంబర్ 3, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, గిరిజన చట్టాల అమలు తదితర డిమాండ్లు 33 తెగలకు సంబంధించినవి ఉండటం వలన, రేపటి బంద్‌కు లంబాడాలు కూడా మద్దతు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అంతేతప్ప వేరే దురుద్యేశం లేదని తెలిపారు. పాలకవర్గాలు విభజించు పాలించు చేయడం వల్ల, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులు రోజురోజుకు కోల్పోయి నష్టం జరుగుతున్న విషయాన్ని గమనించాలని కోరారు. వలసలకు మేము కూడా



వ్యతిరేకమే, పాలకవర్గాలు చేసే కుట్రలో భాగంగా విడిపోయి హక్కులు కోల్పోయే కంటే, ఐక్య ఉద్యమాలు చేసి ఉన్న హక్కులను కాపాడుకుంటూ, కొత్త హక్కులు సాధించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో లంబాడా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు, ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ నాయక్, జిల్లా సలహాదారులు జాదవ్ గోపాల్‌రావు, పవార్ గంగారాం నాయక్, అజ్మీర వినోద్, విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సోమేష్, ధరావత్ శ్యామ్‌రావు, రాథోడ్ సన్నీప్, పవార్ విలాస్, రాథోడ్ కపిల్ ఉన్నారు.

తమ కాలనీకి సుభాష్‌నగర్‌గా నామకరణం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ రోడ్ దర్గా వెనుక ప్రాంతం గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించింది. కాలనీవాసులు సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు నివాసం ఉంటున్న ప్రాంతానికి సుభాష్ నగర్‌గా కాలనీగా పేరు పెట్టాలని, కాలనీ అభివృద్ధి కమిటీ వారు నిర్ణయించుకున్నామని విన్నవించారు. పురపాలక సర్వసభ్య సమావేశం ఏజెండాలో సుభాష్ నగర్ నామకరణం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించి, ఏజెండాలో తీర్మానం చేయుటకు, గౌరవ కౌన్సిల్ సభ్యులందరం కృషి చేస్తామని చైర్మెన్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో రామంచి రాము, ధన్‌రాజ్ కైలాస్, ధన్ రాజ్ సాయినాథ్, కుందూరు రాజేందర్, డి.నార్సింగ్‌రావు, అయ్యన్నగారి నవీన్, రమణ, కార్తిక్, కాలనీవాసులు ఉన్నారు.

లోక కళ్యాణార్థం 8వ సారి మహాపాదయాత్ర



నవతెలంగాణ-నిర్మల్

లోక కళ్యాణార్థం 8వ సారి మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్మెన్, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివసాయి నామస్మరణతో, లోక కళ్యాణార్థం ప్రతీ యడాది మాదిరిగా సాయి దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రావణ మాసం చివరి సోమవారం అంగరంగ వైభవంగా అశేష జన వాహినితో నటరాజ్ నగర్ శివాలయం నుంచి ఆధ్యాత్మిక శైవ క్షేత్రం కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయం వరకు 8వ సారి మహా పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు శివాలయంలో స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, మహా పాదయాత్రను ప్రారంభించారు. సాయి దీక్షా సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్ : యాదవ సంఘం ఆధ్వర్యంలో...

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పట్టణంలోని సంఘ భవనంలో జరిపిన ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణను, గోపికల వేషధారణలో అలరించారు. భక్తి పాటలకు అనుగుణంగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేశారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించిన, ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కుంకుమార్చన కార్యక్రమాన్ని జరిపారు. అంతకుముందు శ్రీ కృష్ణుడిని ప్రత్యేక పూజలతో ఆరాధించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ ఉత్సవాల్లో పాల్గొని, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని మాట్లాడారు. అనాదిగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను భావి తరాలకు తెలియజెప్పేలా పండగ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. శ్రీ కృష్ణుడి భోధనలను నిత్య జీవితంలో ఆచరించాలని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధర్మం వైపే నడవాలన్న కృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి చూపాలని సూచించారు. ప్రతి ఏడు యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలియచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, బీసీ సంఘం అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, యాదవ సంఘం అధ్యక్షులు రఘువీర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి హన్మండ్లు యాదవ్, నారాయణ, మల్లయ్య, రాజు, వేణుగోపాల్ యాదవ్, ప్రఫుల్ పాల్గొన్నారు.



నేరడిగొండ : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యాపకులు విద్యార్థులతో కలిసి కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం విద్యార్థులు కృష్ణుడి వేషధారణలో విద్యార్థినులు రాధా వేషధారణలో నృత్య ప్రదర్శనలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తూ, కృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉట్టి కొడుతుంటే రాధా వేశాధారణలో ఉన్న విద్యార్థినులు ఉట్టి లాగుతూ ఎంతో బ్రహ్మండమైన ప్రదర్శనలతో కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, విద్యార్థులకు నోట్ బుక్‌లు బహుమతి ప్రదానం చేశారు. పాల రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు, మీనా, పాఠశాల అధ్యాపకులు, సుమలత, గంగా కళ్యాణి, అరుంధతి, వీణ, సౌందర్య పాల్గొన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని వివిధ గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కృష్ణుని, గోపికల వేషధారణ ధరించి, ఉట్టి కొడుతూ అలరించారు. కృష్ణాష్టమి వేడుకలను చిన్నారులు ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు.

లోకేశ్వరం : మండలంలోని ఆయా గ్రామాల్లోని స్వాధ్యాయ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుడు, గోపికలుగా చిన్నారుల వేషాధారణతో ప్రధాన వీదుల గుండా యాత్ర చేపట్టి, ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులతో ఉట్టి కొట్టించారు. అనంతరం శ్రీకృష్ణుని పాటలపై చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో...

అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు కృష్ణుని, గోపికల వేషధారణలలో అందరిని అలరించారు. ఈ సందర్భంగా నృత్యాలు, దాగుడుమూతలు కోలాటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సహంగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి విశిష్టతను అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు వివరాంచారు.

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ జాదవ్ ఉమాజీ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను రాధ కృష్ణా వేషధారణలతో ఛత్రపతి శివాజీ మహారాజ్‌చౌక్ వద్ద గ్రామపెద్దలు ప్రదర్శనను తిలకించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ విష్ణు ఫడ్ గ్రామపెద్దలు విశాల్ కోటగిరి, రాథోడ్ శేషరావ్, దినేష్ పటేల్, జాదవ్ పరశురామ్ ఉన్నారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలోని సన్‌షైన్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురు శ్రీకృషుని, బాలికలు గోపిక వేషాదరణంలో వచ్చి ఉట్టిని పగుల గొట్టడం జరిగింది. వాసుదేవుడు, దేవకీ, నందనుడు, యశోద, బాలరాముడు శ్రీకృష్ణుడి వేశాధారణలో బాల బాలికలు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు గణేష్, రాకేష్, సంజయ్, ప్రిన్సిపాల్ విజయ్, సిబ్బంది నడిపెన్న, మారుతీ పాల్గొన్నారు.

నేరడిగొండ



ఉట్నూర్



లోకేశ్వరం



లోకేశ్వరం



ఇచ్చోడ



సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ సైబర్ నేరాలకు గురైతే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి తమ బంధువులు, స్నేహితులను అప్రమత్తం చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రయాణ సమయంలో తమ వాహనాలకు సరైన ధృవపత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సాయంతో రోడ్డెక్కిన ఆటో ట్రాలీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని గూడెం ప్రధాన రహదారిపై కేతిని గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో రహదారిపై కొబ్బరి బొండాల లోడ్‌తో మహారాష్ట్ర వెళ్తున్న ఆటో ట్రాలీ గుంతలో ఇరుక్క పోయింది. క్లాచ్ వైర్ తెగిపోవడంతో ఆటో కదులలేక డ్రైవర్ దిక్కులు చూస్తూ ఇబ్బందులు పడుతున్నాడు. ఆ సమయంలో వానాలు తనిఖీలో భాగంగా సిబ్బందితో కలసి ఎస్సై ఇస్లావత్ నరేష్ గూడెం వైపు వెళ్తున్నారు. ఆటో ట్రాలీని గమనించి విషయం తెలుసుకున్నారు. సిబ్బంది పాటు రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికుల సాయంతో గుంతల ఇరుక్కుపోయిన ఆటో ట్రాలీను బైటికి తీయించారు. దీంతో పోలీస్ సిబ్బందికి ఆటో డ్రైవర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాంటేషన్‌ను సందర్శించిన ట్రైనీ అటవీ అధికారులు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ రేంజ్ పరిధిలో గల ఇటిక్యాల పహాడ్ ప్లాంటేషన్‌ను శిక్షణ పొందుతున్న అటవీ క్షేత్ర అధికారులు సందర్శించారు. శిక్షణలో భాగంగా అస్సాం రాష్ట్రానికి చెందిన శిక్షణలో ఉన్న 40 మంది అటవీ రేంజ్ అధికారుల బృందం, తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ ద్వారా డిప్యూటి డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్లాంటేషన్ సందర్శించారు. గతంలో నాటిన ప్లాంటేషన్లను, ఈ సంవత్సరం నాటుతున్న ప్లాంటేషన్ల విధానాన్ని శిక్షణలో ఉన్న రేంజ్ అధికారుల బృందానికి ఫారెస్ట్ డివిజినల్ అధికారి అప్పలకొండ వారికి వివరించారు. అడవుల అభివృద్ధి, వన్య ప్రాణుల సంరక్షణ టైగర్ కారిడార్, ముఖ్యంగా పులుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బెల్లంపల్లి రేంజ్ అధికారి పూర్ణచందర్ మాట్లాడుతూ మొక్కలు నాటే విధానం ప్లాంటేషన్‌ల సంరక్షణ అడవుల ఉపయోగం వన్య ప్రాణుల సంరక్షణ, భూమిపై అడవులు అంతరిస్తే మానవ మనుగడ శూన్యమని చెప్పారు. డిప్యూటి డైరెక్టర్ బి.వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో శిక్షణ రేంజ్ అధికారులు 300 మొక్కలు నాటించి, మొక్కల సంరక్షణ, వాటి చర్య గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు జి.శ్రీధర్ చారి, ప్రవీణ్ కుమార్, సెక్షన్ అధికారులు మోహన్ రావు, ప్రసాద్, బీట్ అధికారులు నరేష్, అరవింద్, శ్రీదేవి రవీనా, హబీబా తబస్సుమ్ పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన భక్తజనం

నవతెలంగాణ-కౌటాల

శ్రావణ మాస సోమవారం మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో శివుని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ పూజారి అంబేద శంకరయ్య సంతోష్‌ల ఆధ్వర్యంలో శివునికి పాలాభిషేకం చేశారు. కౌటాల, చింతలమానేపల్లి మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శివుని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

పొలాల ఎద్దుల సామాగ్రికి భలే గిరాకీ

నవతెలంగాణ-కౌటాల

పోలాల ఎద్దుల సామాగ్రికి గిరాకీ పెరిగింది. శని, ఆదివారం రోజులలో పొలాల పండుగ జరుపుకోనున్నారు. పొలాలకు మరో వార సంత ఉండదని గ్రహించిన రైతులు ఎద్దులను పూజించడానికి కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేయడానికి రైతు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో సామాగ్రికి గిరాకి పెరిగింది.

మోతుగూడలో ఎక్కాహం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని మోతుగూడ గ్రామంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలోని ప్రసన్న భక్త ఆంజనేయ ఆలయంలో 24 గంటలు నిరంతర భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రతి సంవత్సరం ఎక్కహం కార్యక్రమం చేపట్టి తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ భక్తులు రాజయ్య, వినోద్, దాము, పెంటయ్య పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని గణపతి ఆలయంలో అర్చకులు శ్రీనివాస్ శర్మ, శేఖర్ శర్మ, పూర్ణచందర్ శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్కాహం కార్యక్రమం నిర్వహించారు.

చిన్నూమియా తండాలో వైద్య శిబిరం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని చిన్నూమియా తండ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం వైద్య శిబిరంలో భాగంగా చిన్నూమియా తండా గ్రామంలోని 50 మందికి సాధారణ చికిత్స చేసి మందులను పంపిణి చేశారు. అంతేకాకుండా గ్రామంలోని మరో 20 మందికి జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరణ చేసి, ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యాధికారి భీంరావు పేర్కొన్నారు. గ్రామస్తులను ఉద్యేశించి ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలోని ప్రజలు వర్షాకాలం కలుషిత నీరు తాగకుండా నీటిని శుద్ధి చేసుకొని తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున డెలివరీ సమయం కంటే ఒక రోజు ముందే ప్రభుత్వాస్పత్రికి రావాలని, గర్భిణులు నెల నెల తప్పకుండా చెకప్ చేసుకోవాలని సూచించారు. మూడు కిలోమీటర్లు కాలినడకన గ్రామానికి వచ్చి వైద్యం అందించిన వైద్య సిబ్బందికి గ్రామస్తులు, పలువురు ప్రజాపతినిధులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ సూర్య ప్రకాష్, ఎంఎల్‌ఎచ్‌పీ దివ్యరాణి, హెల్త్ అసిస్టెంట్ జి.రమేష్, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

నేడు ఏజెన్సీ బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

27న ఏజెన్సీ బంద్‌కు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, ఆదివాసులందరూ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. సోమవారం మావల మండలంలోని కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలి. జీఓ నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలని అన్నారు. ట్రైబల్ సబ్ ప్లాన్ ఏరియాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలన్నారు. బంద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కోకన్వీనర్ వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా కన్వీనర్ గోడం రేణుక, కోకన్వీనర్ ఉయిక ఇందిర, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కోకన్వీనర్ సలాం వరుణ్, మహిళా సంఘం డివిజన్ కన్వీనర్ సోయం లలిత, ఆదిలాబాద్ డివిజన్ కోకన్వీనర్ తొడసం ప్రకాష్, గోవిందరావు, రామచందర్ పాల్గొన్నారు.

గుంతలమయంగా ప్రధాన రోడ్లు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న జనం



బీబ్రా సమీపంలో మోకాళ్ల లోతు గుంతలు పడ్డ ప్రధాన రోడ్డు

నవతెలంగాణ-దహెగాం

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధిస్తుంది. కానీ స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ నేటికి అభివృద్ధి చెందలేదు. దీనికి నిదర్శనంగా పై ఫొటోను చూడొచ్చు. ఇది ఎక్కడో మారుమూల గ్రామ సమస్య కానే కాదు. కాగజ్‌నగర్ నుండి దహెగాం మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు పై బీబ్రా సమీపంలో మూడు సంవత్సరాల క్రితం భారీ వరదలు ఉప్పొంగడంతో కొట్టుకుపోయిన రోడ్డు పరిస్థితి ప్రస్తుతం ఇలా తయారైంది. కేవలం వంద మీటర్ల రోడ్డు కొట్టుకుపోతే ఇప్పటీ వరకు మూడు



అధ్వానంగా పెసరికుంట ప్రధాన రోడ్డు

సంవత్సరాలుగా బాగు చేసే నాథుడు లేదంటే మన పాలకుల పాలన తీరు ప్రజా సమస్యలపై వారికి ఉన్న పట్టింపు అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఆటోలు, కార్లు బురదలో కూరుకుపోయిన సందర్భాల కొకల్లలు. ఇది కేవలం ఒకటే సమస్య ఇంకా ఇలాంటివి పెసరికుంట స్టేజీ సమీపంలో అలాగే అందవెల్లి, భట్‌పెల్లి గ్రామాల మధ్య పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది.

విన్నపాలు ఇస్తున్నా పట్టింపు లేదు..

ఒకవైపు విద్యార్థులు బురదలో నిల్చొని ధర్నా చేస్తున్న.. మరోవైపు దహెగాం యువకులు మండల స్థాయి అధికారులు, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న పట్టింపు లేని తనం కనిపిస్తుంది. రోడ్ల గురించి మాట్లాడడం పక్కన పెట్టితే కనీసం స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరించడం లేదని గ్రామస్తులు, యువకులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే అధికారులు, పాలకులు ఉన్నట్ట లేనాట్ట అనే అనుమాలు సైతం వ్యక్తం చేస్తున్నారు.

దయనీయ స్థితిలో రోడ్లు...

దహెగాం మండల చుట్టూ గ్రామాల నుంచి రావాడానికి ఇతర ప్రధాన పట్టణాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యాలు దుర్భరంగా ఉన్నాయి. పెద్ద గుంతలు పడి ఇబ్బందుల మధ్య ప్రయాణం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి బెల్లంపల్లి, కాగజ్‌నగర్, మంచిర్యాల తదితర పట్టణాలకు వెళ్లలంటే గుంతలమయం రోడ్లపై నరకయతనంగా ప్రయాణించాలిందే. అత్యసర సమయంలో అయితే ఈ రహదారి గుండా ప్రాణాలతో చెలగటం ఆడాల్సిందే. మండల కేంద్రం నుంచి వెళ్లే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే మారుమూల పల్లెల నుంచి మండల కేంద్రానికి వచ్చే రోడ్లు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. అధికారులు ఇప్పటికైన స్పందించి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్ల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు(ఫైల్)

జిల్లా వ్యాప్తంగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీ
- ఉట్టికొట్టే పోటీలో అప్పపెల్లి విజేత



ఆసిఫాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న యాదవ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శ్రీకృష్ణుని జన్మదినమైన కృష్ణాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. వేడుకలకు సంబంధించి వారం రోజులుగా జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా సోమవారం ప్రతిచోట ఆ కళ కనిపించింది.

ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీ

జిల్లా కేంద్రంలో యాదవ సంఘం జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో వారి నివాసం నుండి జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. యాదవ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా, కృష్ణాష్టమి వేడుకలు ప్రతిబింబించేలా చిన్నారులతో కృష్ణుడు, గోపిక వేషధారణలు వేయించి వారితో కలిసి సాంప్రదాయ నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో తీసిన ర్యాలీ అందరిని ఆకట్టుకుంది.

ఉట్టికొట్టే పోటీలో అప్పపెల్లి విజేత

కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీతో పెద్ద ఎత్తున ప్రజలు జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనం వద్దకు చేరుకున్నారు. ప్రతి సంవత్సరం లాగానే జిల్లా సంఘ భవనం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యువతకు ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని అంకుశాపూర్, బాబాపూర్, చిర్రకుంట, అప్పపెల్లి, మోతుగూడ గ్రామానికి చెందిన ఐదు జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో విజేతగా అప్పపెల్లి జట్టు నిలిచి మొదటి బహుమతి పొందింది. బహుమతులను ఎంపీపీ మల్లికార్జున్, అరిగెల శరత్ యాదవ్, ప్రముఖ వ్యాపారవేత్త గుండె వెంకన్న ప్రసాద్ గౌడ్, ముషీర్, సుంకరి పెంటయ్య శ్రీశైలం యాదవ్, ప్రణయ్, వనపర్తి సదాశివ్, దుర్గం తిరుపతిలతో కలిసి అందజేశారు.

బెజ్జూర్ : మండలం సోమిని ఆశ్రమం పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు సోమిని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంద్రం భిక్షమయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉదయం నుండే భక్తులు దేవాలయాల్లో పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు మండల సోమవారం ఘనంగా నిర్వహించినారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టె కార్యక్రమాన్ని బృందావనం పీఠాధిపతి శివరాం స్వామితో ప్రారంభించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన అల్లూరి విజయ్ ఉట్టి కొట్టె విజేతగా నిలిచారు. గెలుపొందిన యువకునికి రూ.6532 బహుమతి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బెజ్జూర్ : ఉట్టి కొట్టిన విజేతలకు బహుమతి ఇస్తున్న హెచ్ఎం



కౌటాల : ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బృందావన్ పీఠాధిపతి

యాదవుల అభివృద్ధికి కృషి చేస్తా : అరిగెల



జెండా ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు

నవతెలంగాణ-బెజ్జూర్

యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు అరిగెల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అరిగేలా నాగేశ్వరరావు జెండాను ఎగరవేశారు. కుమురం భీం జిల్లాలో 15 మండలాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నట్లు తెలిపారు. బెజ్జూరు మండల కేంద్రంలోని యాదవ సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుండి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, యాదవ సంఘం మండల అధ్యక్షులు ఎర్రయ్య, సంఘం నాయకులు బాసబోయిన సత్యనారాయణ, భూస శంకర్, గడ్డం శ్రీనివాస్, సురేష్ యాదవ్, ధూపం శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం

బెజ్జూర్ రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షులు తంగడపల్లి మహేష్ ఆధ్వర్యంలో అరిగెల నాగేశ్వర్‌ను శాలువ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనం పట్టివేత



నవతెలంగాణ-రెబ్బెన

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పటుకున్నామని సీఐ చిట్టిబాబు తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలను తెలియజేశారు. ఛత్తీస్‌గాఢ్ రాష్ట్రంలోనీ రాజనందగౌవ్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌కు వాహనంలో పశువులను తరలిస్తున్నారు. సోమవారం ఉదయం ఏకో బ్రిడ్జి వద్ద వాహనం నిలిపి ఉండటంతో బ్లూ కోట్ కానిస్టేబుల్ వాహనం ఐచర్ వ్యాన్‌ను పరిశీలించారు. అందులో అక్రమంగా తరలిస్తున్న పశువులను గుర్తించిన కానిస్టేబుల్ వెంటనే ఎస్సై చంద్రశేఖర్‌కు సమాచారం అందించారు. సమాచార అందుకున్న ఎస్సై సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 24 పశువులుండగా అందులో 3 ఎద్దులు, 21 ఆవులున్నాయి. అందులో 9 ఆవులు మృతి చెంది ఉన్నాయి. మృతి చెందిన ఆవులను పశువైద్యుడు సందీప్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. మిగిలిన 15 పశువులను గోశాలకు తరలించారు. ఐచర్ ఐచర్ వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్ తమిరసన్, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు కర్జవెల్లిలో కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జవెల్లి గ్రామంలో మంగళవారం ఓంకార ఆశ్రమం, రాధాకృష్ణ మందిరంలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉట్టి కోట్టే కార్యక్రమంలో భక్తులు, యువకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు శ్రీశ్రీశ్రీ విష్ణు సేవానందగిరి, మలయాళ సద్గురు గీతా మందిర మఠాధిపతులు మాధవరపు రంగస్వామి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందే విధంగా చూడాలన్నారు. అంతే కాకుండా జిల్లాలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భావనలు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌లా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

మొక్కలు నాటిన స్వగృహ లబ్ధిదారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లో న్యూఅగ్రజా టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా స్వగృహ లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని, ఉత్సాహంగా మొక్కలు నాటారు. ప్లాట్ల కొనుగోలు దారులందరూ ఒకచోట చేరి 200 మొక్కలను నాటారు. నాటిన మొక్కలకు కర్రలు పాతి రక్షణగా తాడుతో కట్టారు. మొక్కలను సంరక్షించేందుకు ట్రీగార్డులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, జలంధర్‌రెడ్డి, న్యూఅగ్రజా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానానికి వంట సామాగ్రి అందజేత

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శివాలయానికి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ రాంప్రసాద్ రూ.12వేల విలువగల ప్లేట్లు, గంజులను, ఇతర వంట సామాగ్రిని ఆలయ పూజారి హన్మోల్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద అన్నదానం చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా వంట సామాగ్రిని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భక్తులు పాల్గొన్నారు.

పులాజీ బాబా జయంతి వాల్‌పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 29, 30 తేదీలలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నిర్వహించే, సద్గురు శ్రీ పూలాజీ బాబా 100వ జన్మదిన మహోత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం పులాజీ బాబా ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. సుగుణను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు, ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల వివరాలను వివరించారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి సుగుణ పోస్టర్ ను ఆవిష్కరించారు. జయంతి ఉత్సవాలకు హాజరవుతానని సుగుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూడే కైలాష్, ముక్కడే విష్ణు, రాము, నాందేవ్ మహారాజ్, భరత్, కుమురంభీం జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాధ్ పాల్గొన్నారు.

లంబాడా జేఏసీ నాయకుల మద్దతు అవసరం లేదు

నవతెలంగాణ-ఉట్నూర్

27న తలపెట్టిన ఏజెన్సీ బంద్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆదివాసీ 9తెగలతో పాటు గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేపట్టడం జరుగుతుందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పూర్క బాపురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో లంబాడి జేఏసీ నాయకులు మాట్లాడుతూ మా మద్దతు కూడా ఉంటుందని చెప్పడంతో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తెల్చి చెప్పింది. మీ మద్దతు మాకు అవసరం లేదనీ అన్నారు. సోమవారం ప్రెస్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేము 9 తెగలు తోటి పోరాడుతాం 1976లో ఎమర్జెన్సీ సమయంలో అక్రమంగా ఒక జీఓ ద్వారా మీరు వచ్చారని మీ లంబాడాల వల్లనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భూములను కోల్పోతున్నామని అన్నారు. వలసలు వచ్చి ఏజెన్సీ ప్రాంత హక్కులు చట్టాలను భంగం కలిగిస్తూ ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారని, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఏకైక ప్రధాన డిమాండ్ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించిన తర్వాతనే ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని వేయాలని కోరారు. రేపు జరగబోయే బంద్‌లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యాపారస్తులు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

మండల వాసికి యోగారత్న అవార్డు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికిచెందిన దుర్గం వినోద్ కుమార్ కు యోగా రత్న అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో సరూర్నగర్ జ్యోతి క్లబ్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లాస్థాయి యోగా పోటీల్లో భాగంగా యోగాలో సేవలు అందిస్తున్న వినోద్ కుమార్‌కు తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి జే మనోహర్ ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్‌ను, తెలంగాణ మహర్ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, రవీందర్‌రావు, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జన్నారం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, అభినందించారు.

'భారీ వాహనాలకు అనుమతి ఇచ్చేలా చూడాలి'

నవతెలంగాణ-జన్నారం



భారీ వాహనాలకు అనుమతి ఇచ్చేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌కు అభయారణ్య ఆంక్షలు ఎత్తివేత కమిటీ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. భారీ వాహనాలు రాకపోవడంతో ప్రజలకు ఉపాధి దొరకడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆంక్షల ఎత్తివేత కమిటీ నాయకులు భూమాచారి, దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, ఎజాజ్, బీజేపీ నాయకులు గోలి చందు పాల్గొన్నారు.

స్పీడ్‌కు బ్రేకులు లేనట్లేనా..?

- కవ్వాల్‌లో టైగర్ జోన్‌లో రోడ్డు ప్రమాదాలు
- అమలుకాని 30కిలోమీటర్ల నిబంధన
- అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో వాహనాలు దూసుకెళ్తున్నాయి. వాహనాల వేగం గంటకు 30కిలోమీటర్లకు మించరాదనే నిబంధనలు ఉన్నా వాహనదారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. అడవి నుంచి బయటకు వచ్చిన వన్యప్రాణులు ప్రమాదం బారిన పడుతున్నాయి. కొన్ని సమయాల్లో వన్యప్రాణుల వల్ల వాహనదారులూ ప్రమాదం బారిన పడిన గాయపడుతున్నారు. వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో వేగం పెంచ డంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. ఈ క్రమంలో టైగర్ జోన్‌లో వేగం నియంత్రించేందుకు అధికారులు నాకాబందీ పేరిట తనిఖీలు చేస్తూ వాహదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు బేఖాతార్ చేస్తున్న వాహనదారులు

దట్టమైన అడవులు, వన్యప్రాణుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా 2012లో కవ్వాల్ అభయారణ్యాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్ జోన్‌గా ప్రకటించింది. అప్పటి నుంచి ఒక్కో నిబంధన అమలు చేస్తు న్నారు. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. భారీ వాహనాలకు అనుమతి నిరాకరిం చారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. టైగర్ జోన్‌లో సుమారు 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇరువైపుల అడవులు ఉండడం వల్ల వన్యప్రాణులు రోడ్డు దాటే అవకాశం ఉంది. దీంతో అధికారులు టైగర్ జోన్ పరిధిలో వాహనదారులు గంటకు 30కిలోమీటర్ల వేగం దాటవద్దనే నిబంధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రధాన రహదారికి ఇరువైపుల తపాలాపూర్ నుంచి కడెం వరకు, ఉట్నూర్ వరకు అటవీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడక్కడ వన్యప్రాణులు వాహనాలను ఢీకొని ఎలా చనిపోతాయో బోర్డులు ఏర్పాటు చేశారు. అడవి ఎక్కువగా ఉన్న ప్రాంతం వైపు రోడ్డుకు పక్కనే జాలీలతో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయినా వాహనదారులు పట్టిం చుకోకుండా అతివేగంగా వెళ్తుండడంతో వన్యప్రా ణులు వాహనాలకు తగిలి మత్యువాత పడుతు న్నాయి. జన్నారం నుంచి తపాలాపూర్ చెక్ పోస్టు మధ్యలో అనేక ప్రమాదాలు జరిగాయి.

వాహనదారులకు అవగాహన

టైగర్ జోన్ ప్రాంతంలో వాహనాల వేగానికి బ్రేక్ వేసేందుకు నూతన పద్ధతిని అవలంబిస్తున్నారు. తాళ్లపేట, జన్నారం, ఇందన్పల్లి అటవీ రేంజ్ల ప్రాంతంలో అటవీ అధికారులు జట్టుగా తనిఖీలు చేస్తూ వేగనియంత్రణపై అవగాహన కల్పిస్తు న్నారు. వేగానికి సంబంధించిన బోర్డులను డ్రైవర్‌కు ఇస్తూ పాటించాలని సూచిస్తున్నారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల వన్యప్రాణులు తగిలి ప్రమాదాలు జరిగితే గాయాల పాలయ్యే అవకాశం ఉందని, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వన్యప్రాణి చనిపోతే కేసులు అవుతాయని, వాహనంలో ప్రయాణిస్తున్న వారికి డ్రైవర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని సూచనలు సలహాలు అందిస్తున్నారు.



వన్యప్రాణుల సంచారం దృష్ట్యా స్పీడ్ తగ్గించి వెళ్లాలని సూచిస్తున్న బోర్డు



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు



గంటకు 30 కిలో మీటర్ల వేగం దాటొద్దని సూచిస్తున్న బోర్డు



కవ్వాల్ టైగర్ జోన్‌లో పలు సంఘటనలు

రాత్రిపూట వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో అతివేగంగా వెళ్తే ప్రమాదాలు సంభవిస్తాయి. అడవిపందులు, దుప్పులు, నీలుగాయిలు అతివే గంగా రోడ్డు దాటే అవకాశం ఉంది. జన్నారం మండలంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గాయపడ్డారు.

- రెండేళ్ల క్రితం జింకల పార్కు సమీపంలో అడవిపంది అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఐదుగురుగాయపడ్డారు.
- మహ్మదాబాద్ గ్రామ సమీపంలో అడవి పంది రోడ్డు దాటే క్రమంలో ఆటోకు తగలడంతో బోల్తాపడింది. నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు.
- జన్నారానికి చెందిన బీజేపీ మాజీ అధ్యక్షుడు గోలి చందు బైక్‌పై వస్తుండగా ఒక్కసారిగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి తీవ్రంగా గాయపడ్డాడు.
- రాత్రివేళ పెట్రోలింగ్‌కు వెళ్లిన పలువురు అటవీ అధికారులు కూడా వన్యప్రాణులు తగిలి గాయాలపాలయ్యారు.
- తపాలాపూర్ గ్రామ సమీపంలో మంచిర్యాలకు చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టి కిందపడ్డారు. ఈ ఘటనలో భార్య మృతిచెందింది. ఇలా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం

హాఫీస్ ఉద్దీన్, ఎఫ్ఆర్ఓ ఇంధన్‌పల్లి.



టైగర్‌జోన్ ప్రాంతంలో వేగం తగ్గిం చాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కాని కొందరిలో మార్పు రావడం లేదు. వన్యప్రాణులు ఒకేసారి బయటకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నం దున రోడ్డుకు ఇరువైపుల వ్యూలైన్స్ ఏర్పాటు చేశాం. వేగం 30 కిలోమీటర్లలోపే వెళ్లాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లు అడవి ప్రాంతంలో పడేయవద్దు. ఈ విషయాలపై వాహ నదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

స్టేషన్ రికార్ధులను సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-వేమనపల్లి

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సర్వీస్ బుక్స్, లీవ్ రికార్డులతో పాటు తదితర రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు గ్రేవ్, నాన్ గ్రేవ్ సీడీ ఫైల్స్‌ను పరిశీలించాలన్నారు. పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎస్ఐని ఆదేశించారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించాలని, గంజాయి, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని బ్లూ కోట్ సిబ్బందిని ఆదేశించారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యామ్ పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

నవతెలంగాణ-జన్నారం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న పలువురు మండల స్థాయి అధికారులతో పాటు పదవీ కాలం పూర్తి చేసు కున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీతో కలిసి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లుగా ఆ సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోపి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొంతం శంకరయ్య, ప్రచార కార్యదర్శి దాసరి రాజన్న తెలిపారు. సోమవారం ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి మున్నూరు కాపు సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

నేటి ఏజన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి మంగళవారం 27న ఏజన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని దేవాపూర్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య మాట్లాడుతూ ఏజన్సీ ప్రత్యేక డీఎస్సీని ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీఓ 3ను కొనసాగించాలని, ట్రైబల్ కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక జీఓ ఏర్పాటు చేయాలని, గిరిజన బెటాలియన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజన్సీ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఏజన్సీ బంద్‌లో ప్రతి ఒక్క ఆదివాసీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యాక్షుడు రాయిసిడం శంకర్ పాల్గొన్నారు.

రోప్ హాలేజీ సిస్టంను పరిశీలించిన డీడీఎంఎస్ అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో అండర్ గ్రౌండ్ గనులలో రూప్ హాలేజీ సిస్టంను డీడీఎంఎస్ అధికారి దిలీప్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం గని ప్లాన్లను రికార్డులను, గనిలోని పని స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీఎం(సేఫ్టీ) బీపీఏ రీజియన్ కె రఘు కూమార్, ఎజీఎం(ఇ అండ్ ఎం)బీపీఏ రీజియన్ రామనాదం, డీజీఎం(ఇ అండ్ఎం) ఎస్ఆర్‌పీ ఏరియా ఇంజనీర్ బి.చంద్రశేఖర్, ఆర్కే-5,6 గూప్ ఏజెంట్ ఎస్.శ్రీధర్, ఆర్కే-6 గని మేనేజర్ ఇ.తిరుపతి పాల్గొన్నారు.

ఎస్సై అంజమ్మను కలిసిన మాల సంక్షేమ సంఘం నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అంజమ్మను మాల సంక్షేమ సంఘం మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గజానంద్, ప్రకాష్, దేవన్న, ముత్యాల రవి, మాజీ ఎంపిటిసి సంటి, సురేష్, ప్రతాప్, వేణు, నర్సిములు, ప్రభాకర్, రాజేశ్వర్, సంటి, రజినీకాంత్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలం దేవునిగూడ గ్రామంలో గల్ఫ్ నిరుపేద కార్మికుడు చొప్పదండి దుబ్బయ్య భార్య ఇటీవల క్యాన్సర్‌తో మరణించడంతో నిరుపేద కుటుంబానికి దేవుని గూడా గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ.5000 ఆర్థిక సాయం 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమ సమితి నాయకులు మాట్లాడుతూ, గల్ఫ్‌లో ఉండి వేలాది రూపాయలు రాష్ట్రానికి తీసుకువచ్చిన వారి కుటుంబాలకు జీవనోపాధి మాత్రం కొనసాగడం లేదన్నారు. రెక్కాడితే డొక్కాడనీ ఇలాంటి గల్ఫ్ కటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌరవ అధ్యక్షుడు కునారపు భీమరాజు అధ్యక్షుడు సాంబారి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగాల మల్లేష్, క్యాషియర్ ఏడేలి సత్తన్న, ఉపాధ్యక్షుడు కర్నె సురేందర్, కార్యదర్శులు దేసవేని గోపాల్, మల్లేష్, సభ్యులు కునారపు గంగాధర్, కాల్వ సాయికుమార్, కుశనాపెలి రాజన్న మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-మందమర్రి

రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి సొన్నాయిల చిన్నయ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సొన్నాయిల చిన్నయ్య(70) కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిస అయ్యాడు. ఇద్దరు కొడుకులు ఎలాంటి పనులు లేక కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి భార్యతో గొడవపడి ఇంట్లో చున్నితో ఉరి వేసుకున్నాడు గమనించిన తన భార్య కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందికి దించి స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుపోగా సొన్నాయిల చిన్నయ్య చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతుని పెద్ద కొడుకు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నవతెలంగాణ-మందమర్రి

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించినప్పుడే సంస్థ అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ ఏరియాకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా జీఎం దేవేందర్, ఏరియా ఉన్నతాధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం రక్షణ కార్పొరేట్ చింతల శ్రీనివాస్, జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ జీఎం సేఫ్టీ కార్పొరేట్‌గా వారి అనుభవంతో సింగరేణి సంస్థను ప్రమాద రహిత సింగరేణిగా మార్చడంలో ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘు కుమార్, జీఎం సేఫ్టీ కేహెచ్ఎన్ గుప్తా ఆర్‌జీ రీజియన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎంవై వెంకటరమణ, డీజీఎం ఐడి రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్‌లో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రవీందర్ తమ సిబ్బందితో కలిసి ఒక ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీ నిర్వహించారు. పింజరిగుట్ట కాలనీకి చెందిన షేక్ అఫ్రోజ్ అను వ్యక్తి అనుమానస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అతను తన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.27వేలు, సెల్ ఫోన్ స్వాధీన పరచుకొని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

పట్టణ పరిధిలోని లిటిల్ రోబోస్ ప్లే స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలు ధరించి ఆటపాటలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంను నిర్వహించారు. ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపల్ వూట్ల సత్యనారాయణ, ట్రస్మా నస్పూర్ మండల అధ్యక్షుడు మైదం రామకృష్ణ, కోశాధికారి అంబాల రాజకుమార్, మంచిర్యాల కోశాధికారి బండారి మమత, లత, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని పలు పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. వారు ఆట పాటలతో అలరించారు. విద్యార్థులు ఉట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్ని ఉట్టిని కొట్టారు.



మండలంలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలో లంబాడ కులస్తులు సోమవారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బంజారా సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జువ్విగూడా గ్రామంలో ఉన్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ దేవి మాతకు ఆ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతులు వెదురు బుట్టలలో ఉంచిన గోధుమ వరి మొలకలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా జువ్విగూడ నుండి ధర్మారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాదవ్ సందేశ్, ప్రకాష్ నాయక్, బీవీఎస్ నాయక్, బిమ్లాల్ నాయక్, రాములు నాయక్, రామ్ కిషన్ నాయక్, సంతోష్ నాయక్, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పాల్గొన్నారు.

మహిళలను నమ్మించి మోసం చేసిన లక్కీ లేడీ

- లక్కీ స్కీమ్ పేరుతో కోట్లు వసూలు
- ఆశ పడి మోసపోయిన అమాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

నమ్మినందుకు నట్టేట ముంచుతున్నారు కొందరు నయ వంచకులు, అమాయక ప్రజలను చూసి చిట్టీలు, లక్కీ స్కీమ్‌లు, ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. అదే తరహాలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఒక మహిళ లక్కీ స్కీం పేరుతో పట్టణ వాసులను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రతి నెల డబ్బులు కడితే లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి పెద్ద మొత్తంలో వస్తువులు ఇస్తామని చెప్పి వారి వద్ద నుంచి కోట్లలో వసూలు చేసింది. తర్వాత అడ్రస్ లేకుండా పోయింది. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బెల్లంపల్లి కేంద్రంగా గాలం

బెల్లంపల్లికి చెందిన ఒక మహిళా జై గణేష్ ఎంటర్ ప్రైజస్ పేరుతో లక్కీ స్కీమ్ ప్రారంభించింది. తెలిసిన వారు, బంధువులు,స్నేహితులకు స్కీమ్‌ల గురించి వివరించి వారిని ఏజెంట్‌గా నియమించింది. 10 మందిని ఏజెంట్‌గా ఏర్పాటు చేసి ఒక్క ఏజెంట్ దాదాపు 100 మంది సభ్యులు స్కీమ్‌లో జాయిన్ చేసేలా ప్రేరేపించింది. మహిళా మాయ మాటలు నమ్మిన ఏజెంట్‌లు నిజమే అనుకుని వారికి తెలిసిన వారిని స్కీమ్‌లో జాయిన్ చేశారు. ఇలా 999 మంది సభ్యులు అయ్యారు. ఒక్కో వ్యక్తి నెలకు రూ.650 చొప్పున 20 నెలలు కట్టాలి, 20 నెలలు పూర్తి అయ్యే వరకు సభ్యులు కట్టిన డబ్బులు రూ.13000 రూ అవుతాయి. సభ్యుల పేర్లను కలిపి ప్రతి నెల లక్కీ డ్రా తీసి డ్రాలో పేరు వచ్చిన సభ్యుడికి వారి వద్ద ఉన్న గృహపకరణకు ఉపయోగించే ఒక్కో వస్తువు ఇవ్వడం అనేది స్కీమ్ ఉదేశ్యం. వస్తువుల్లో మొబైల్, టీవి, రి ఫ్రిజిరేటర్, వాషింగ్ మేషన్, బైక్, బంగారంతో పాటు కొన్ని విలువైన వస్తువులను చేర్చారు. ఇలా బెల్లంపల్లిలో దాదాపు 999 మంది సభ్యులను స్కీమ్‌లో చేర్చుకొని వారి వద్ద నుండి ప్రతి నెల డబ్బులు వసులు చేశారు. ఇందుకు గాను బెల్లంపల్లిలో ఒక ఆఫీస్ తెరిచి ఉద్యోగులను నియమించింది. ఎంటర్ ప్రైజస్‌కు రిజిస్ట్రేషన్, జీఎస్‌టీజి కడుతున్నట్లు తప్పుడు పత్రాలు చూపించి స్కీమ్‌లో సభ్యులను చేర్చుకుంది. రెండు, మూడు నెలలకు ఒకసారి ఒక వస్తువు ఇచ్చేదని, ఇంట్లోకి సంబంధించిన వస్తువులు కాబట్టి ఎప్పటికి అయిన ఇస్తుందనే నమ్మకంతో ప్రతి నెల డబ్బులు కట్టామని బాదితులు ఆందోళన చెందుతున్నారు. ఏండ్లు గడిచిన డబ్బులు, వస్తువులు తిరిగి ఇవ్వక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డబ్బులు కట్టిన సభ్యులు ఏజెంట్‌ల ఇంటి వద్దకు వచ్చి గొడవలు చేయడంతో స్కీమ్ బాగోతం బయటకు వచ్చింది. కొన్ని రోజులు అడ్రస్ లేకుండా పోయిన మహిళ వివరాలు సేకరించిన బాధితులు నిర్మల్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి నిలదీయడంతో ఒక్కోకరికి డబ్బులు ఇస్తానని చెప్పినట్లు తెలిపారు. గతంలో బెల్లంపల్లి పోలీసులను బాదితులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మళ్లీ ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని పోలుసులు తెలిపారు.

వదిలేది లేదు

అమృత బెల్లంపల్లి



మాది మహారాష్ట్ర, ఇక్కడికి వచ్చి ఇండ్లలో పని చేసుకుంటు బ్రతుకుతున్న, పని చేస్తే వచ్చే పైసలతో స్కీమ్‌లో డబ్బులు కట్టిన, ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మి ప్రతి నెల పైసలు ఇచ్చిన, ఇంటి కోసం ఏదైనా వస్తువు అయిన వస్తది అనే ఆశ ఉండి రెండు సంవత్సరాలు గడిచింది ఒక్క రూపాయి కూడ తిరిగి ఇవ్వలేదు. ఎం చేయలేక పోతున్న, పది ఇండ్లలో పని చేసి బ్రతుకుతున్న, నా డబ్బులు నాకు వచ్చేలా చూడాలి.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఈశ్వరమ్మ

దగ్గరి బంధువని నమ్మినం. అందరిని ముంచింది, నాకు ఇంకా రూ.4 లక్షల రావలి. ఇప్పటికే బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అమాయకులని చూసి మోసం చేసింది. అందరికి డబ్బులు ఇవ్వాల్సిందే, ఎప్పుడు అడిగిన ఇస్తాను అని చెప్తుంది. కానీ ఇప్పటికి కట్టిన డబ్బులు, వస్తువులు ఇవ్వలేదు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

బిజినెస్

శేఖర్ శర్మ ఐపిఒ నిబంధనల ఉల్లంఘన...!

- పేటియం షేర్లలో కుదుపు



ముంబయి : పేటియం ప్రమోటర్, సిఇఒ విజయ్ శేఖర్ శర్మ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు సంబంధించి ప్రమోటర్ క్లాసిఫికేషన్ నిబంధనలు ఉల్లంఘించారని మార్కెట్ రెగ్యూలేటర్ సెబీ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. శేఖర్ శర్మతో పాటు మాజీ బోర్డు మెంబర్లకు కూడా ఈ నోటీసులు అందినట్లు మనీకంట్రోల్ ఓ కథనం వెల్లడించింది. దీంతో సోమవారం పేటియం షేర్లు ఓ కుదుపునకు గురైయ్యాయి. ఓ దశలో ఆ సంస్థ షేర్లు 8.8 శాతం పతనమై రూ.505.25కు దిగజారగా.. అనంతరం కొంత కోలుకుని తుదకు 4.48 శాతం నష్టంతో రూ.530 వద్ద ముగిసింది.

మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ 2021 నవంబర్‌లో ఐపిఒకు వచ్చినప్పుడు క్లాసిఫికేషన్ నిబంధనలు పాటించలేదు. సెబీకి ఐపిఒ పత్రాలు సమర్పించినప్పుడు విజయ్ శేఖర్ శర్మ ఆ సంస్థ ఉద్యోగిగా కాకుండా ప్రమోటర్‌గా యాజమాన్య నియంత్రణ కలిగి ఉన్నట్లు తెలిపారు. పేటియం వైఖరిని బోర్డు సభ్యులు ఆమోదిస్తున్నారా? లేదా? తెలుపాలంటూ వారికీ సెబీ నోటీసులు జారీ చేసింది. ఐపిఒలో విజయ్‌శేఖర్ శర్మను లార్జ్ షేర్ హోల్డర్ అని పేర్కొన్నారు. సెబీ నిబంధనల ప్రకారం.. ప్రమోటర్లు ఐపిఒ తర్వాత ఉద్యోగి స్టాక్ ఆప్షన్లు అందుకోవడంపై నిషేధం. దీనిపై స్పష్టత ఇవ్వాలని ఎక్స్చేంజీలు సైతం వివరణ కోరినట్లు తెలుస్తోంది. 2021లో ఐపిఒకు వెళ్లడానికి ముందే పేటియం సిఇఒ విజయ్ శేఖర్ శర్మ తన వాటాలో 5 శాతం తన కుటుంబ ట్రస్ట్ విఎస్ఎస్ హోల్డింగ్ ట్రస్ట్‌కు బదిలీ చేశారు. అనంతరం ఆయన వాటా 9.6 శాతానికి తగ్గింది. దీంతో కంపెనీ నిర్వహణ బాధ్యతలు నిర్వహించవచ్చునని పేటియం వర్గాలు తెలిపాయి. 10 శాతం లోపే వాటా గల వాటాదారులు కంపెనీని ప్రొఫెషనల్‌గా మేనేజ్ చేయొచ్చునని తెలుస్తోంది.

2021లో పేటియం ఇష్యూ ధర రూ.2150 కాగా.. 9 శాతం డిస్కౌంట్‌తో రూ.1995 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఆ తర్వాత ఎప్పుడు కూడా ఆ స్థాయికి చేరలేదు. మదుపర్లకు భారీ నష్టాలను మిగిలిచ్చింది. పేటియం తన విలువను పెంచి చూపిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు నిబంధనలు ఉల్లంఘించి సరైన డాక్యూమెంట్లు లేకపోయిన వేలాది ఖాతాలు జారీ చేయడంతో పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ ఇటీవల చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది ఆ సంస్థ షేరు ధర రూ.310 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇటీవలే కోలుకుంటున్న పేటియంపై మళ్లీ సెబీ పిడుగు పడింది. సెబీ నోటీసులపై పేటియం స్పందిస్తూ.. ఇదేం కొత్త విషయం కాదని పేర్కొంది. మార్చి 31, జూన్ 30తో ముగిసిన త్రైమాసిక ఫలితాల్లోనూ స్టాక్ ఆప్షన్ వివరాలు వెల్లడించామని పేర్కొంది. సెబీకి కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని తెలిపింది.

ఫియోనా రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్

నవతెలంగాణ: ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (బంగే ఇండియా), తెలంగాణ రాష్ట్రంలో తన కుటుంబం నుండి రిఫైన్డ్ సన్ఫ్లవర్ ఆయిల్ బ్రాండ్, ఫియోనాను విస్తరించనున్నట్లు సగర్వంగా ప్రకటించింది. ఫియోనా రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్లో మొత్తం శ్రేయస్సును నిర్వహించడానికి చాలా కీలకమైన ఏ,డీ,ఈ విటమిన్లు ఉన్నాయి. అయినప్పటికీ, వంట ప్రక్రియలో ఈ విటమిన్లు గణనీయమైన మొత్తంలో నాశనమవుతాయని గుర్తించిన బంగే ఇండియా, ఫియోనా రిఫైన్డ్ సన్ఫ్లవర్ ఆయిల్ను కొత్త VitoProtect ఫార్ములాతో ప్రారంభించింది.

ఇక రుణాలు తీసుకోవడం సులభం



న్యూఢిల్లీ : రుణాలు తీసుకోవడాన్ని మరింత సులభతరం చేయనున్నట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. ఇందుకోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్ఐ)ను తీసుకురానున్నట్లు పేర్కొంది. గతేడాదే ఆగస్టు 17న ప్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరుతో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దీన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. సోమవారం బెంగళూరులో శక్తికాంత ఓ సమావేశంలో మాట్లాడుతూ.. డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యుపిఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో అదే తరహాలో రుణ వితరణలో యుఎల్ఐ కూడా దూసుకుపోనుందన్నారు. భూ రికార్డులు సహా ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యుఎల్ఐ పని చేస్తుందన్నారు. దీంతో రుణ ఆమోద ప్రక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ ప్రక్రియ అవసరం ఉండదన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఖాతాదారుడి సమగ్ర ఆర్థిక వివరాలను ఆర్‌బిఐ సేకరించనుందని తెలుస్తోంది.

అందుబాటు ధరలో సామ్సంగ్ గెలాక్సీ ఏ55, ఏ35

నవతెలంగాణ-హైదరాబాద్: సామ్సంగ్ గెలాక్సీ ఏ55 5 జీ, గెలాక్సీ ఏ35 5జీ స్మార్ట్ ఫోన్లపై గతంలో ఎన్నడూ చూడని ధరను ప్రకటించింది. సర్కిల్ టు సెర్చ్ విత్ గూగుల్ అనే ఏఐ ఫీచర్లతో ఇవి అందుబాటులో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. పరిమిత వ్యవధి ఆఫర్ కింద గెలాక్సీ ఏ55 రూ.33999తో ప్రారంభం వివరాలు కానుండగా, ఏ35 రూ.25999 ధరతో అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్లు గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్లస్, ఏఐ ద్వారా మెరుగు పరచబడిన కెమెరా ఫీచర్లు, సామ్సంగ్ నాక్స్ వాల్ట్, నాలుగు ఓఎస్ అప్ గ్రేడ్లు, ఐదు సంవత్సరాల భద్రతా నవీకరణలతో సహా బహుళ ప్రతిష్టాత్మక ఫీచర్ను కలిగి ఉన్నట్లు సంస్థ తెలిపింది. అదేవిధంగా వివిధ బ్యాంకుల క్రెడిట్కార్డులపై వరుసగా గెలాక్సీ ఏ55పై రూ.6000, ఏ35పై 5000 క్యాష్బ్యాక్ అవకాశంతో పాటు, ఆరునెలల వరకు ఈఎంఐ సదుపాయాన్ని అందుబాటులో ఉంచింది. అదే విధంగా గరిష్టంగా ఏ55పై రూ.6000, ఏ35 రూ.5000 వరకు అప్ గ్రేడ్ బోనస్ కూడా పొందే అవకాశం ఉంది. అయితే క్యాష్బ్యాక్ లేదా అప్ గ్రేడ్ బోనస్లలో ఒక్కదానిని మాత్రమే పొందవచ్చు.

ఫోన్‌పేలో UPIపై క్రెడిట్ లైన్ సౌకర్యం

నవతెలంగాణ-హైదరాబాద్: ఫోన్‌పే కస్టమర్ల సౌలభ్యం కోసం మరో అడుగు ముందుకేసింది. తమ ప్లాట్‌ఫామ్‌లో UPI పేమెంట్లకు క్రెడిట్ లైన్‌ను ఎనేబుల్ చేసుకునే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చామని ఈ రోజు ప్రకటించింది. తమ బ్యాంక్‌ల నుండి క్రెడిట్ లైన్లు పొందే యూజర్లు ఇకపై వీటిని ఫోన్‌పేలో UPIకి లింక్ చేయవచ్చు. దీంతో మర్చంట్లకు ఎప్పటికప్పుడు సజావుగా పేమెంట్లు చేసేందుకు వీలవుతుంది. ఈ ఫీచర్ వల్ల లక్షలాది మర్చంట్ల వద్ద కస్టమర్లు తాము చేసే కొనుగోళ్లకు సౌకర్యవంతంగా పేమెంట్లు చేయగలరు. అంతేగాక స్వల్పకాలిక క్రెడిట్ సౌలభ్యాన్ని వినియోగించుకుని, వాళ్ల నెలవారీ ఖర్చులను మెరుగ్గా మేనేజ్ చేసుకోగలుగుతారు. అందుకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ యూపీఐ పరిధిని విస్తరించింది.

నెట్‌వర్క్ మెరుగుదలకు విఐ పెట్టుబడులు

నవతెలంగాణ : తెలంగాణలోని తమ వినియోగదారులకు డేటా స్పీడ్, కవరేజ్‌ను పెంచే దిశగా నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపర్చడంపై భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు వొడాఫోన్ ఐడియా (విఐ) తెలిపింది. రాష్ట్రంలోని తమ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. రాష్ట్రంలోని 4,000 పైచిలుకు సైట్లలో ఎల్‌టిఇ 2500 ఎంహెచ్‌జడ్ బ్యాండ్‌లో స్పెక్ట్రంను 10 ఎంహెచ్‌జడ్ నుంచి 20 ఎంహెచ్‌జడ్‌కు అప్‌గ్రేడ్ చేసినట్లు విఐ తెలుగు రాష్ట్రాల బిజినెస్ హెడ్ ఆనంద్ దానీ తెలిపారు.

రన్ ఆఫ్ కచ్ లో తన నైపుణ్యం నిరూపించిన ద ఇంటిలిజెంట్ సీయూవీ, ఎంజి విండ్సర్

నవతెలంగాణ-హైదరాబాద్: జేస్ డబ్ల్యూ ఎంజి మోటార్ భారతదేశంలో రాబోతున్న వాహనం- ఎంజి విండ్సర్, భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ (CUV) గుజరాత్ లోని సమస్యాత్మకమైన భూభాగం రన్ ఆఫ్ కచ్ లో తన సాటిలేని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. భారతదేశపు మొదటి CUV-ఎంజి విండ్సర్ తన నైపుణ్యాన్ని నిరూపించింది మరియు ప్రపంచంలోనే అతి పెద్ద ఉప్పు ఎడారులలో ఒకటైన రన్ ఆఫ్ కచ్ లోని 44oCకి పైగా తీవ్రమైన వేడిలో తన ఇంజనీరింగ్ శ్రేష్టతను వెల్లడించింది.

శిఖం భూములపై 'రియల్' కన్ను

బఫర్‌జోన్‌లో బంగ్లాలు..

- కేసరి సముద్రంలో నిర్మించిన 33 ఇండ్ల గుర్తింపు
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 64 అక్రమణలు
- కోర్టు ఆదేశాలు బేఖాతర్
- హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- రాష్ట్ర వ్యాప్తంగా విస్తరణకు డిమాండ్స్

శిఖం భూములపై కన్నేసిన రియల్ మాఫియా చేయని ఆగడాలంటూ లేవు. ముందుగా కొంత స్థలం కొనుగోలు చేశాక.. క్రమంగా మొత్తం కుంట/చెరువునే మాయం చేస్తున్నారు. మొదట బఫర్‌జోన్ సమీపంలో 500 గజాల జాగాను కొనుగోలు చేస్తారు.. ఆ తర్వాత చెరువులో నీరు నిల్వకుండా తూమును రాత్రిపూట మరోకంట పడకుండా జేసీబీలతో ధ్వంసం చేస్తారు.. చెరువులో నీరు నిల్వకుండా చేసి శిఖం భూమి మొత్తాన్ని ప్లాట్లుగా మార్చుతారు.. మొదట కొనుగోలు చేసిన సర్వే నంబరుకు బై నంబరు వేసి భూములను అమ్మేసి సొమ్ము చేసుకుంటారు. ఇలా చేసిన ప్లాట్ల నిర్మించినవే నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం బఫర్‌జోన్‌లో 33 ఇండ్లు. మహబూబ్‌నగర్ పెద్ద చెరువుల కబ్జా చేసి 64, వనపర్తి జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువులో 50 ప్రాంతాల్లో విలాసవంతమైన విల్లాలు, బంగ్లాలు, ఆవాసాలు, బేకరీలు, పాఠశాలలు నిర్మించారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లో జరుగుతున్న కూల్చివేతల మాదిరిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనూ హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాల శిఖం భూములు అన్యాక్రాంతం నుంచి బయటపడతాయని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి డిమాండ్లు ప్రభుత్వానికి వస్తున్నాయి. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

నాగర్‌కర్నూల్ చెరువు శిఖం 2800 ఎకరాలు ఉంటుంది. స్థిరీకరించని ఆయకట్టు 5వేల ఎకరాలు. సుమారు 3వేల మంది రైతులు భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారు. తాడూరు, మల్కాపూర్, ఎండబెట్ల, పుల్జాల, తాళ్లపల్లి, నడిగడ్డ, కార్వంగ, జమిస్తాపూర్, గగ్గలపల్లి గ్రామాల్లో ఈ సాగు భూములున్నాయి. చెరువు స్థలం ఆక్రమణకు గురవడం వల్ల నీరు నిల్వ ఉండటం లేదు. దాంతో ఆయకట్టు సాగుకు నీరందడం లేదు. కేసరి సముద్రంలో శిఖం భూముల్లో 33 ఆవాసాలు నిర్మించుకున్నట్టు అధికారులు సర్వే చేసి నిర్ధారించారు. ఇందులో ప్రధానంగా ఎండబెట్ల గ్రామ సమీపాన బఫర్‌జోన్‌లో విల్లాను నిర్మించారు.. దీనికి రూ.50 కోట్లకు పైగానే ఖర్చు చేశారు. ఇక్కడ స్విమింగ్‌పూల్, పార్కింగ్‌తో పాటు రహస్య కార్యక్రమాలు సైతం జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. వర్షాకాలంలో విల్లా చుట్టూ నీరు చేరుతుంది. అయితే, నీరు విల్లా సమీపానికి రాకుండా ఇనుప రాడ్లతో చుట్టూ సిమెంటు ప్రహరీ నిర్మించుకున్నారు. వరద ఎంత వచ్చినా.. ఇంటి వరకు చేరకుండా మట్టిపోశారు. దాంతోపాటు అలుగు తగ్గిస్తే శాశ్వతంగా నీటి సమస్య ఉండదని రాత్రిపూట జేసీబీలతో ఉయ్యాలవాడ దగ్గర ఉన్న అలుగును ధ్వంసం చేశారు. ఇలా ఎకరాల కొద్దీ శిఖం భూములను ఆక్రమించుకోవడం వల్ల చెరువులో నీరు నిల్వకుండా బయటికి పారి డిండిలో కలుస్తోంది. కేసరి సముద్రంలోని నిర్మాణాలపై కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను మొత్తం కూల్చాలని ట్రిబ్యునల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే, నిర్మాణాల కూల్చివేతను ఆపడానికి కొందరు రియల్ వ్యాపారులు సామాన్య ప్రజానీకం చేత హైకోర్టులో కేసు వేయించారు. ఆక్రమణల వెనక మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి.

మహబూబ్‌నగర్ పెద్దచెరువు 96 ఎకరాల శిఖం ఉండగా.. ఇప్పుడు 50 ఎకరాలకు కుంచించుకపోయింది. నీరు బయటకు వెళ్లే కాల్వలు, అలుగులు పారే తూములు కబ్జాకు గురయ్యాయి. ఈ కారణంగా భారీ వర్షాలు వస్తే పట్టణానికి మునక తప్పదు. నెక్లెస్ పేరుతో మరో కట్ట నిర్మాణం చేయడంతో చెరువు విస్తీర్ణం మరింత తగ్గిపోయింది. ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా అధికారులు హడావుడి చేసి నివేదికల పేరిట కాలయాపన చేస్తున్నారు. సర్వే నెంబరు 67లో ఉన్న చెరువు నేడు క్రమంగా కనుమరుగు అవుతోంది. చెరువు నుంచి వరద వచ్చి సమీపంలోని ఇండ్లను ముంచెత్తుతోంది. బఫర్‌జోన్‌లో 64 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు నివేదికలు ఇచ్చినా.. మున్సిపల్ అధికారులు కూల్చేయాలంటున్నా.. పైఅధికారుల నుంచి స్పందన రావడం లేదన్న విమర్శలున్నాయి. కొందరు పెద్ద రియల్ మాఫియాకు చెందిన వారు బడానాయకుల చుట్టూ తిరుగుతూ నిర్మాణాలను కాపాడుకుంటున్నారు. ఇటీవల సుందరీకరణ పేరుతో ఆక్రమణలు సక్రమం చేసుకుంటున్నారు. ఇప్పటికీ కొందరు మట్టి, ఇసుక, సిమెంటుతో పాటు ఇండ్లను కూల్చిన మన్ను తెచ్చి చెరువులో పోసి ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. ఇదంతా చూస్తూ అధికారులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు శిఖం భూములను కాపాడాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

ఆక్రమణదారులను నియంత్రించాలి

మహబూబ్‌నగర్ పెద్దచెరువు నామ రూపాలు లేకుండా పోయింది. పెద్దచెరువును ట్యాంకుబండ్ చేయడం మంచిదే అయినా.. ఆక్రమణలపై దృష్టి పెట్టలేదు. ఒకవైపు సుందరీకరణ పనులు జరుగుతుండగానే.. మరో వైపు ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రకృతి విపత్తులకు కారణమవుతున్న అక్రమ కట్టడాలను కూల్చేయాలి. ముఖ్యంగా రియల్ మాఫియా అక్రమాలను కట్టడి చేయడం ద్వారానే ప్రకృతి వైపరీత్యాలను అరికట్టవచ్చు.

ఎ. రాములు, సీపీఐ(ఎం)
జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఉక్రెయిన్ ఇంధన సదుపాయాలపై
రష్యా క్షిపణి దాడులు



మాస్కో : రష్యా సరిహద్దుల్లో ఉక్రెయిన్ దాడులను తీవ్రతరం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన మాస్కో ఎదురు దాడికి దిగింది. సోమవారం ఉక్రెయిన్ గ్రిడ్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులను ఉధృతం చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో సహా డ్నిప్రో, క్రోపివ్నిట్స్కీ, విన్నిట్సియా, క్రివీ రిహ్, ఖార్కివ్ వంటి నగరాలపై దాడులను రష్యా కొనసాగించింది. ఉక్రెయిన్‌కు చెందిన కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలపై దాడిని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. కచ్చితమైన, దీర్ఘ శ్రేణి ఆయుధాలతో ఈ దాడిని ప్రారంభించినట్లు తెలిపింది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఛేదించినట్లు తెలిపింది. గత 24 గంటల్లో రెండు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ స్టేషన్లు, నాలుగు ఫీల్డ్ మందుగుండు డిపోలు ధ్వంసమైనట్లు తెలిపింది. అలాగే, గత కొన్ని రోజులుగా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన 90 మంది సైనికులు మృతి చెందినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌కు చెందిన పలు సైనిక బృందాలపై ఈ దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దాదాపు 100 క్షిపణులు, 100 డ్రోన్లతో రష్యా దాడి చేసినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. తాజా ఘర్షణల్లో రష్యా చేసిన అతిపెద్ద దాడుల్లో ఒకటిగా తెలిపారు. అలాగే ఈ దాడి వలన ఉక్రెయిన్ ఇంధన రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే ప్రస్తుతం సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.

కాలుష్యపు కోరల్లో నగరాలు

- 2030 నాటికి 76 భారతీయ నగరాల్లో భారీగా వాయు కాలుష్యం..
- సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ అధ్యయనం

న్యూయార్క్ : దేశంలోని 76 నగరాల్లో వాయు కాలుష్యంపై సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) కీలక అధ్యయనం నిర్వహించింది. ఇందులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నిర్దేశించిన లక్ష్యాల్లో కొన్ని నగరాలు మాత్రమే రాబోయే కాలంలో టార్గెట్‌ను అందుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. 2019లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. జాతీయ నాణ్యత ప్రమాణాలకనుగుణంగా లేని 131 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడమే దీని లక్ష్యం. 2030 నాటికి కేవలం ఎనిమిది నగరాలు మాత్రమే ఉద్గారాలను 40శాతం తగ్గించగలవని రెండున్నరేండ్ల పాటు నిర్వహించి అధ్యయనంలో తేలింది. అంతేకాదు 2019తో పోలిస్తే 2030 నాటికి ఆయా నగరాల్లో ఉద్గారాలు 11 నుంచి 45శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా నగరాల్లో గాలి నాణ్యత పీఎం 10, పీఎం 2.5, ఎస్ఓ2, ఎన్ఓ ఎక్స్ అనే నాలుగు నిర్దిష్ట కాలుష్య కారకాలను దృష్టిలో పెట్టుకొని అధ్యయనం నిర్వహించారు.

పేదలను ఇండ్ల నుంచి ఖాళీ చేయించొద్దు

నవతెలంగాణ - హైదరాబాద్

వరంగల్ దేశాయిపేటలోని 13వ డివిజన్‌లో బీపీఎల్ పథకం కింద పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో కట్టిన ఇండ్లను ఖాళీ చేయించరాదని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను హైకోర్టు ఆదేశించింది. చట్ట ప్రకారం ఆ స్థలాల విషయంలో నిర్ణయం తీసుకునే వరకు పేదలను వారి ఇండ్ల నుంచి ఖాళీ చేయించొద్దని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ వినోద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం 2007-2023 మధ్యకాలంలో పేదలకు పట్టాలు ఇస్తే అందులో ఇండ్లు కట్టుకున్నారనీ, ఇప్పుడు అవి చెరువుల శిఖం భూమిలో ఉన్నాయనో, బఫర్ జోన్‌లో ఉన్నాయనో, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయనో చెప్పి కూల్చివేస్తామని నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. ఒకరు పట్టాలు ఇవ్వడం, మరొక శాఖ కూల్చివేస్తామనడం సముచితంగా లేదన్నారు. బీపీఎల్ పథకం కింద రెవెన్యూ అధికారులు 2007-2023 మధ్య కాలంలో పేదలకు 30 నుంచి 60 గజాల జాగాలకు పట్టాలిచ్చారని పిటిషనర్ల తరపున వాదన వినిపించారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ అంశాలపై సర్వే కూడా లేకుండా తమకు నోటీసులు ఇచ్చారన్నారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

ఇదే తరహాలో వరంగల్ కార్పొరేషన్‌లోని చిన్నవాడపల్లి నిర్మాణాలపై ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పెద్ద సంఖ్యలో దాఖలైన పిటిషన్లను మరో న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయంటూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ జులై 25న ఇచ్చిన నోటీసులను పలువురు సవాలు చేశారు. పిటిషనర్లు ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారనీ, ఇప్పుడు అధికారులు వచ్చి ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయని చెప్పి కూల్చివేస్తామని నోటీసులు ఇవ్వడం అన్యాయమని పిటిషనర్ల వాదన. వాదనలను విన్న తర్వాత న్యాయమూర్తి, పేదల గుడిసెలను కూల్చరాదని వరంగల్ కార్పొరేషన్‌ను ఆదేశించారు. చిన్న వడ్డేపల్లి చెరువు శిఖం పరిధిలో పిటిషనర్లు ఉన్నారని భావిస్తే వారికి చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి వాళ్ల వాదనలు వినాలనీ, ఆపై చర్యలు చట్ట నిబంధనలకు లోబడి ఉండాలని కార్పొరేషన్‌కు ఆదేశించారు. విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించారు.

దళితులను ఆలయంలోకి రానివ్వని బీసీ కులస్తులు

- శివారు వెంకటాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి..
- గ్రామాన్ని సందర్శించిన సీఐ, ఎస్ఐ
- తమకు న్యాయం చేయాలని పోలీసులతో బాధితుల మొర



నవతెలంగాణ-మర్కుక్

కాలం మారుతోంది.. అభివృద్ధిలో దేశం ముందుకు సాగుతోంది.. అయినా దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ కొన్ని చోట్ల దళితుల ఆలయ ప్రవేశాలను అడ్డుకుంటున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘిస్తూ వివక్ష చూపిస్తున్నారు. ఇలాంటి ఘటనే సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దుర్గమ్మకు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించేందుకు దళితులు ఆలయానికి వచ్చారు. వారిని ఆలయంలోకి వెళ్లనివ్వ కుండా బీసీ కులస్తులు అడ్డుకున్నారు.

శివారు వెంకటాపూర్ గ్రామంలో దుర్గమ్మ గుడిని నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలోని దళితులు దుర్గమ్మకు బోనాలు సమర్పించేందుకు రాగా, కొంత మంది బీసీ కులస్తులు అడ్డుకున్నారు. దుర్గమ్మ బోనాలు తీయొద్దని,గుళ్ళోకి ప్రవేశం లేదని రావొద్దని అన్నారు. దాంతో వారు మర్కుక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్ సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని కులస్తుల ప్రజలు సమన్వయంతో ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ దేవతలకు కులాలతో సంబంధం లేకుండా అందరూ బోనాలు తీయొచ్చని, ఎవరైనా అడ్డుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని, అంటరానితనం పాటిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని, అందరూ శాంతియుతంగా, అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామస్తులకు మంగళవారం మరోసారి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు.. తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు.

నేడు కోటగుళ్లలో గవర్నర్ పర్యటన

నవతెలంగాణ-గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళను నేడు (మంగళవారం) తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు ములుగు జిల్లా రామప్ప, జయశంకర్ జిల్లా గణపురం మండలం కోటగుళ్లలో గవర్నర్ పర్యటన కొనసాగనుంది. గవర్నర్ పర్యటనను పురస్కరించుకొని అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం భూపాలపల్లి డీఎస్పీ అవిరినేని సంపత్‌రావు ఆధ్వర్యంలో చిట్యాల సీఐ డి. మల్లేష్, గణపురం ఎస్ఐ రేఖ అశోక్ కోటగుళ్ళను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గవర్నర్ కోటగుళ్ల పర్యటన సందర్భంగా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలతో సుమారు 150మంది సివిల్ స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వివరించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఇతర వాహనాలను నిలిపివేయడం జరుగుతుందని గవర్నర్ పర్యటన ప్రొటోకాల్ ప్రకారం కొనసాగుతుందని గర్భాలయంలోకి ఎవరికీ అనుమతి ఉండదని, మీడియాకు అనుమతి లేదని తెలిపారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కోటగుళ్లలో పారిశుద్ధ్య పనులు 3 రోజులుగా కొనసాగుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయడంతో పాటు ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ ఆధ్వర్యంలో చెట్లను తొలగిస్తున్నారు. డీఎల్‌పీఓ వీరభద్రం ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్, కార్యదర్శులు హరిచంద్ర రెడ్డి, విజేందర్, హేమంత్, రాకేష్, ఏపీవో రాజు, టీఏలు నవ్య, రాజశ్రీ శ్రావణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ దూలం శ్రీదేవి, చెన్నూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రష్యా దాడులతో ఉక్రెయిన్ అంతటా బ్లాక్‌అవుట్



మాస్కో : ఫక్రెయిన్ అంతటా పారిశ్రామిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున దీర్ఘ-శ్రేణి రష్యా వైమానిక దాడి ప్రారంభించింది. ప్రతిస్పందనగా రష్యాపై దాడులు కొనసాగిస్తానని కీవ్ ప్రతిజ్ఞ చేసింది. ఉక్రేనియన్ వైమానిక రక్షణ దళాల ప్రకారం, వివిధ రకాల డ్రోన్లు, క్షిపణులతో దాడి సోమవారం తెల్లవారుజామున ప్రారంభించబడింది. రష్యా సైన్యం ఆ రోజు తర్వాత ఆపరేషన్‌ను ధవీకరించింది. ఇది అన్ని ఉద్దేశించిన లక్ష్యాలను ఛేదించిందని నివేదించింది. రష్యా దేశవ్యాప్తంగా ఉన్న క్లిష్టమైన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటోంది. జాపోరోజీ ప్రాంతంలోని కీవ్-నియంత్రిత భాగాన్ని నిర్వహించే ఇవాన్ ఫెడోరోవ్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నాడు. అత్యవసర షట్‌డౌన్‌ల కారణంగా బ్లాక్‌అవుట్‌లు సాధ్యమే. కీవ్‌లో మేయర్ విటాలి క్లిట్ష్కో ఉక్రేనియన్ రాజధానిలో విద్యుత్ సరఫరాకు అంతరాయాల గురించి, జాతీయ గ్రిడ్‌తో ఉన్న సమస్యల గురించి ప్రకటించాడు. ఇంధన మంత్రి జర్మన్ గలుషెంకో పరిస్థితిని కష్టతరమైనదిగా వర్ణించాడు.

గ్రిడ్ ఆపరేటర్ దానిని ఎదుర్కోవటానికి అత్యవసర బ్లాక్‌అవుట్లను అనివార్యం చేసిందని ధవీకరించాడు. ఇంతలో, ప్రధాన మంత్రి డెనిస్ ష్మిగల్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌లోని 15 ప్రాంతాలను రష్యా దాడులు ప్రభావితం చేశాయని, రష్యా లోపల లోతైన దాడులకు కీవ్ తమ ఆయుధాలను ఉపయోగించటానికి అనుమతి ఇవ్వాల్సిందిగా పాశ్చాత్య ఆయుధ దాతలను కోరాడు. రష్యా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ డిపోలకు వ్యతిరేకంగా డ్రోన్ దాడులకు కీవ్ చేసిన ప్రచారానికి ప్రతిస్పందిస్తూ వసంతకాలంలో మాస్కో ఉక్రేనియన్ పవర్ ప్లాంట్లపై దాడి చేయడం ప్రారంభించింది. ఉక్రేనియన్ ఆయుధ ఉత్పత్తిని, ఫ్రంట్‌లైన్‌లో కొత్త దళాలను మోహరించే సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. సోమవారం విజయవంతమైన హిట్‌లను ఉక్రేనియన్ అధికారులు ధవీకరించారు. లుట్స్క్ మేయర్ అయిన ఇగోర్ పోలిష్‌చుక్, మౌలిక సదుపాయాల లక్ష్యానికి నష్టాన్నినివేదించాడు. పోల్టావా రీజియన్ అధిపతి ఫిలిప్ ప్రోనిన్ కూడా విద్యుత్ సరఫరాలో అత్యవసర అంతరాయాన్ని ధవీకరించాడు. ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ చీఫ్-ఆఫ్-స్టాఫ్ ఆంద్రీ యెర్మాక్ ప్రతీకారం తీర్చుకుంటామని బెదిరించాడు. ఆదివారం రాత్రి కీవ్ రష్యాలోని సరాటోవ్, ఎంగెల్స్ నగరాలపై సుదూర దాడులను ప్రారంభించింది. యారోస్లావల్ ప్రాంతంలో చమురు శుద్ధి కర్మాగారానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న ఉక్రేనియన్ డ్రోన్ కూడా అడ్డగించబడిందని గవర్నర్ మిఖాయిల్ యెవ్రేవ్ చెప్పాడు. ఉక్రేనియన్ డ్రోన్‌లు దేశంలోని వివిధ ప్రాంతాలలో 20కి పైగా అడ్డగించబడ్డాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం ఉదయం ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో, ఉక్రెయిన్ రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి పెద్ద ఎత్తున సరిహద్దు చొరబాట్లను ప్రారంభించింది. ఆ చొరబాటు సమర్థవంతంగా నిలిపివేయబడిందని మాస్కోలోని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కీవ్ దళాలు ఇప్పటికీ ఈ ప్రాంతంలో భూభాగాన్ని ఆక్రమించుకున్నప్పటికీ వారంతటా భారీ ప్రాణనష్టాన్ని ఎదుర్కొంటున్నారు.

రికార్డు స్థాయిలో 9.31 మిలియన్ సందర్శకులను స్వాగతించిన దుబాయ్

నవతెలంగాణ-హైదరాబాద్: దుబాయ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకానమీ అండ్ టూరిజం (డీఈటీ) ప్రచురించిన డేటా ప్రకారం, జనవరి నుండి జూన్ 2024 వరకు 9.31 మిలియన్ల మంది అంతర్జాతీయ సందర్శకులను దుబాయ్ స్వాగతించింది. 2023 మొదటి అర్ధభాగంలో వచ్చిన 8.55 మిలియన్ల పర్యాటకుల కంటే ఇది 9శాతం ఎక్కువ. 2023లో దుబాయ్ ను మొత్తం మీద 17.15 మిలియన్ల అంతర్జాతీయ యాత్రికులు సందర్శించారు. 2024లో అంతకు మించిన సంఖ్యలో సందర్శకులు రానున్నారని అంచనా. ఈసందర్భంగా దుబాయ్ కార్పోరేషన్ ఫర్ టూరిజం అండ్ కామర్స్ మార్కెటింగ్ (డీసీటీసీఎం) సీఈఓ ఇస్సామ్ కాజిమ్ మాట్లాడుతూ... వినూత్నమైన, విలక్షణమైన ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అనుభవాలు, ఆకర్షణలతో మరింత ఉన్నత ప్రమాణాలను అభివృద్ధి చేయటం ద్వారా దుబాయ్ పర్యాటకులను ఆకర్షించటంలో ముందంజలో ఉందన్నారు. దుబాయ్ తప్పనిసరిగా సందర్శించాల్సిన గమ్యస్థానంగా నిలపడానికి ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల మధ్య భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

రెండు ఆవిష్కరణలు ప్రకటించిన బంధన్ బ్యాంక్

నవతెలంగాణ-హైదరాబాద్: వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంధన్ బ్యాంక్ మహిళల కోసం అవని పేరిట ప్రత్యేక సేవింగ్స్ ఖాతాను ఆవిష్కరించింది. అలాగే ఎంటర్ ప్రైజ్వ్యా ప్తంగా వినూత్న మైన బంధన్ బ్యాంక్ డిలైట్స్ లాయల్టీ ప్రోగ్రాంను కూడా బ్యాంకు ఆవిష్కరించింది. ఈ ప్రోగ్రాం కింద కస్టమర్లు, డిలైట్ పాయింట్స్ పేరిట రివార్డ్ పాయింట్లను పొందవచ్చు. అలా పోగుపడిన డిలైట్ పాయింట్లను తమ కొనుగోళ్ల కోసం ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేక ఆఫర్లను కూడా ఆస్వాదించవచ్చు. ఈసందర్భంగా బంధన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మధ్యంతర) రతన్ కేశ్ మాట్లాడుతూ.... బంధన్ బ్యాంక్ ఒక యూనివర్సల్ బ్యాంక్గా మారి తొమ్మిదేళ్లవు తోందన్నారు. ఈ వ్యవధిలో వివిధ వర్గాల కస్టమర్ల అవసరాలను తీర్చేలా తమ ప్రోడ కుల శ్రేణిని పటిష్టపర్చుకున్నామన్నారు.